# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు సమావేశం నిర్వహిస్తారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు.**
3. **సాంకేతిక కారణాలతో వరద సాయం అందని ప్రజల ఖాతాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు నగదు జమచేయనుంది.**
4. **అంతర్జాతీయ ప్రమాణాలతో ఏకీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించనున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**
5. **నాగార్జున సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.**

==========================

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక సమీక్షా సమావేశానికి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంమంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు హాజరుకానున్నారు. 2026 నాటికి మావోయిస్టుల సమస్య రూపుమాపడమే లక్ష్యంగా ఈ సమీక్ష సమావేశంలో చర్చలు జరగనున్నాయి. మావోయిస్టులు కట్టడి కార్యాచరణ, రాష్ట్రాల భాగస్వామ్యంపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి ఉభయ తెలుగు రాష్ట్రాల మంత్రులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతికుమారి, డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరుకానున్నారు. అలాగే ఈ సమీక్ష సమావేశంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ వరద బాధితుల్లో ఇప్పటి వరకు 98 శాతం మందికి నష్ట పరిహారం జమ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం కేటాయించిన 602 కోట్ల రూపాయల పరిహారంలో 584 కోట్ల రూపాయల నిధులను వరద బాధితులకు అందించినట్లు తెలిపింది. సాంకేతిక కారణాలతో వరద సాయం అందని ప్రజల

ఖాతాల్లో ఈరోజు నగదు జమచేయనున్నట్లు తెలిపింది. ఆధార్ అనుసంధానం సహా పలు కారణాలతో ఇప్పటికీ పరిహారం పొందని ఒక్కో కుటుంబానికి నగదు బదిలీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. ఎన్టీఆర్ జిల్లాలో 15 వేలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4 వేల 620 కుటుంబాలతో సహా ఇతర జిల్లాల్లో బాధిత ప్రజలకు జిల్లా అధికార యంత్రాంగం ద్వారా అకౌంట్లలో నగదు జమ చేయనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈరోజు మధ్యాహ్నం ఉండవల్లి నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నారు. సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమవుతారు. కాగా రేపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ , కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏకీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించనున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. యంగ్ ఇండియా ఏకీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు, సముదాయాల అంశంపై హైదరాబాద్‌లో నిన్న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ అనంతరం బట్టి విక్రమార్క పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయించామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచే అన్ని నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు.

---------------------------

హైదరాబాద్ నగరం నుంచి గోవాకు వెళ్లే పర్యాటకులకు కొత్త రైలు అందుబాటులోకి వచ్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లే రైలును సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కేంద్ర మంత్రి నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి రెగ్యులర్ సర్వీసులు ఈ నెల 9న, వాస్కోడగామా నుంచి 10న ప్రారంభమవుతాయని చెప్పారు. సికింద్రాబాద్–వాస్కోడగామా రైలు ప్రతి బుధ, శుక్రవారాల్లో అందుబాటులో ఉంటుందని అన్నారు. కాచిగూడ, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, గుంతకల్, బళ్లారి, మడగావ్ స్టేషన్లలో ఈ రైలు ఆగుతుందని తెలిపారు.

---------------------------

ఒప్పంద ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. గ్రామీణ నీటిసరఫరా విభాగంలో పనిచేస్తున్న ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబరేటరీ ఒప్పంద ఉద్యోగులు మంగళగిరి కేంద్రకార్యాలయంలో నిన్న ఉప ముఖ్యమంత్రిని కలిసి వారి సమస్యల్ని వివరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తామని, బకాయి జీతాలను జమ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు కల్పించామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన 'కొలువుల పండుగ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 16 వందల 35 మందికి నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు ఎల్బీస్టేడియంలో 11 వందల 63 టీచర్ల ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నామని అన్నారు. 55 కిలో మీటర్ల మేర మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టును పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

నాగార్జున సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంత్రి నిన్న పర్యటించి, అద్దంకి సాగునీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువ పరివాహక ప్రాంతంలో పూడిక, మొక్కల తొలగింపు పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పర్చూరుకు కూడా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

హైందవ సంస్కృతిలో పండుగలకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని ప్రముఖ రచయిత, విజయవాడ కాకరపర్తి భావనారాయణ –కెబిఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అన్నారు. ఆయన రాసిన 'హైందవ సంస్కృతి – వైజ్ఞానికత' పుస్తకాన్ని తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న జరిగిన సింహ వాహన సేవకు ముందు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి పండుగ వెనుక ఒక శాస్త్రీయత, సంప్రదాయం, వైజ్ఞానికత దాగి ఉన్నాయన్నారు. సనాతన హైందవ జీవనవ్యవస్థ సర్వోన్నతమైన వ్యవస్థగా రూపొందేలా ఋషులు అద్భుత కృషి చేశారని తెలిపారు.

---------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీమహాచండి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి శక్తిమంతమైన రూపాల్లో ఈ రూపం ఒకటని,చండీమాత అనుగ్రహం వలన విద్య, కీర్తి సంపదలు లభిస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా శ్రీశైలం దసరా మహోత్సవాలలో భాగంగా గత రాత్రి భ్రమరాంబికాదేవి అమ్మవారు కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు అలక బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఈరోజు మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి దర్శనమిస్తారు. ఈ రోజు రాత్రి సర్వభూపాల వాహనంలో స్వామి

వారు దర్శనమివ్వనున్నారు. కాగా గత రాత్రి ముత్యపు పందిరి వాహనసేవ వైభవంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేతంగా స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

-------------------------

ప్రకృతి రమణీయతకు అల్లూరి సీతారామరాజు జిల్లా నెలవని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి, పర్యాటకానికి అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామాగా నిలిచిందన్నారు అటవీ శాఖ సమన్వయంతో పర్యాటక అభివృద్ధి చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

======================